సాక్షి
వికారాబాద్
శుక్రవారం, 25, ఏప్రిల్, 2025



ఉపాధి కూలి పెంచాలి

ఉపాధి కూలీలకు వేతనం పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సత్తయ్య కోరారు.

10లో ▸



ఉగ్రమూకలకు..

జమ్మూకశ్మీర్‌లో కాల్పులకు తెగబడ్డ ఉగ్ర మూకలకు ఉరిశిక్ష వేయాలని బార్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు.

10లో ▸



జోరుగా ఇసుక దందా

దోమ మండలంలో ఇసుక అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోంది. అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

11లో ▸

న్యూస్‌రీల్

నేడు వాహనాలకు వేలం

కొడంగల్ రూరల్: వివిధ కేసుల్లో పట్టుబడిన రెండు వాహనాలకు పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ శాఖ సీఐ వెంకటేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాలీ ఆటో, హీరో హోండా స్పెండర్ బైక్‌కు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనవచ్చని, ముందుగా రూ.5 వేలు డిపాజిట్ చేయాలని తెలిపారు. యాక్షన్‌లో పాల్గొని వాహనాలను దక్కించుకోని పక్షంలో డిపాజిట్ చేసిన డబ్బు తిరిగి పొందవచ్చని తెలిపారు.

ఘనంగా సత్యసాయి ఆరాధనోత్సవం



సత్యసాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

పరిగి: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 14వ ఆరాధన దినోత్సవాన్ని గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు పెరుగన్నం, పులిహోర, స్వీట్లు అందజేశారు. అనంతరం మాజీ ఎంపీపీ అరవింద్‌రావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. భక్తితోనే ముక్తి లభిస్తుందన్నారు. భగవాన్ సత్యసాయి ప్రపంచానికి ఎంతో నేర్పించారని, ఆయన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవాసమితి పరిగి కన్వీనర్ అనంతరావు, సభ్యులు శివలింగం, వేణుగోపాల్, రాఘవేందర్‌రెడ్డి, కిష్టయ్య, సుజాత పాల్గొన్నారు.

ఉన్నత స్థానంలో నిలవాలి



తన్మయిని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

పరిగి: మంచి విద్యనభ్యసించి ఉన్నత స్థానంలో నిలవాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి ముకుంద నాగేశ్వర్ ముదిరాజ్ ఇంటర్ ఉత్తీర్ణులకు సూచించారు. ఇంటర్మీడియట్‌లో 994 మార్కులు సాధించిన పరిగి పట్టణానికి చెందిన తన్మయిని గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాగా చదువుకునే విద్యార్థులకు సంఘం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి మాణిక్యం, నాయకులు శ్రీశైలం, బాబయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



అంగన్‌వాడీ కేంద్రంలో కోడిగుడ్లను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

కుల్కచర్ల: అంగన్‌వాడీ కేంద్రాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని దిశ కమిటీ సభ్యులు జానకీరాం చౌహాన్, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి సూచించారు. గురువారం కుల్కచర్లలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సెంటర్లలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, వైద్య సేవలు అందించడం జరుగుతోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య ముదిరాజ్, నాయకులు చంద్రలింగం, రాజు, ఆంజనేయులు, అంగన్‌వాడీ టీచర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు ఒక మతానికి సంబంధించింది కాదు

మొయినాబాద్‌రూరల్: వక్ఫ్ బోర్డు ఒక మతానికి సంబంధించింది కాదని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. హిమాయత్‌నగర్ చౌరస్తాలోని బీజేపీ కార్యాలయంలో గురువారం వక్ఫ్ చట్ట సవరణ సదస్సు 2025 పేరుతో వక్ఫ్ చట్టసవరణ జిల్లా కన్వీనర్ అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ అధ్యక్షతన వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వక్ఫ్ అనేది 90 శాతం అన్ని మతాలకు సంబంధించిందని స్పష్టం చేశారు. 2024 వక్ఫ్ బిల్లు పాసైందన్నారు. దాదాపు పది లక్షల ఎకరాల ఆర్థిక సంపద ఉన్నా 2024లో కేవలం రూ.168 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చిందన్నారు. వక్ఫ్ బోర్డుపై ప్రజల్లో చైతన్యం కల్పించాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు.

పచ్చధనం స్వాహా!

మున్సిపల్ పార్కుల నిర్వహణకు భారీగా నిధులు

- 50శాతం కూడా ఖర్చు చేయని వైనం
- మిగిలిన మొత్తం కాజేస్తున్నారనే ఆరోపణలు
- గడ్డి, పిచ్చి మొక్కలతో నిండిన పార్కులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

మున్సిపాలిటీల వారీగా పార్కుల సంఖ్య	
వికారాబాద్	35
తాండూరు	25
పరిగి	07
కొడంగల్	02

ఇవి కాకుండా పూర్తిగా వదిలేసిన పార్కులు మరికొన్ని ఉన్నాయి.



వికారాబాద్‌లోని ఓ పార్కులో ఎండిపోయిన మొక్కలు

వికారాబాద్: మున్సిపాలిటీల్లో పార్కుల నిర్వహణ కోసం కేటాయిస్తున్న నిధులు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఏటా ఒక్కో పార్కు అభివృద్ధికి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు నిధులు విడుదలవుతున్నా సగం కూడా ఖర్చు చేయకుండానే పూర్తిగా వెచ్చించినట్లు రికార్డులు చూపుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో నాలుగు మున్సిపాలిటీ(వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్)ల్లో దాదాపు 80 పైచిలుకు పార్కులు ఉన్నాయి. హరితహారం కార్యక్రమంలో భాగంగా వీటిలో మొక్కలు నాటారు. గ్రీన్ బడ్జెట్ పేరిట ఏటా రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. కానీ పార్కుల్లో పచ్చదనం మచ్చుకైనా కనిపించడం లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మున్సిపల్ అధికారులు, గత పాలకవర్గం ఇష్టారాజ్యంగా వ్యవహరించి నిధులు కాజేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే పలుమార్లు మున్సిపల్ కమిషనర్లపై కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. గతంలో జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశాల్లో కూడా ప్రతిపక్ష కౌన్సిలర్లు గ్రీన్ బడ్జెట్ నిధుల స్వాహాపై నిలదీసిన సంఘటనలు కూడా ఉన్నాయి.

గ్రీనరీ కోసం 10శాతం నిధులు

జిల్లాలోని ఒక్కో మున్సిపాలిటీలో వార్షిక బడ్జెట్ రూ.6 కోట్ల నుంచి 15 కోట్ల వరకు ఉంటుంది. ఇందులో 10శాతం గ్రీన్ బడ్జెట్ కింద కేటాయిస్తారు. ఈ నిధులతో మొక్కల సంరక్షణ, పార్కుల నిర్వహణ చేపట్టాలి. ఏటా నాలుగు మున్సిపాలిటీల్లో పచ్చదనం కోసం రూ.50 లక్షల నుంచి రూ.1.50కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు లెక్కలు చూపుతున్నారు. అయితే ఈ నిధుల్లో 50శాతం కూడా ఖర్చు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ట్రీ గార్డులు, నీటి సరఫరా, సంరక్షణ పేర్లతో సగం నిధులు స్వాహా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కొన్ని చోట్ల వెంచర్ నిర్వాహకులు పార్కులు ఏర్పాటు చేసుకుంటే వాటిని కూడా మున్సిపల్ శాఖ ఏర్పాటు చేసిందని అధికారులు డబ్బు కాజేశారని గత పాలక మండలి సమావేశంలో సభ్యులు ఆరోపించారు.

పర్యవేక్షణ గాలికి..

మున్సిపాలిటీల్లో పచ్చదనం పెంపునకు అధిక మొత్తంలో నిధులు ఖర్చు చేస్తున్నా ఉన్నతాధికారులు పర్యవేక్షణ లేకుండా పోయింది. హరితహారం మొక్కలు నాటే సమయంలో హడావుడి చేసే ఉన్నతాధికారులు ఆ తర్వాత అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో లక్షలాది రూపాయల నిధులు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం గ్రీన్ బడ్జెట్ నిధులు సక్రమంగా వినియోగమయ్యేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



యాలాల: రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు

గ్రామీణ రోడ్లకు పెద్దపీట

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: గ్రామీణ రోడ్ల విస్తరణ, మట్టి రోడ్లను బీటీ రోడ్లుగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని బండమీదిపల్లి గేటు నుంచి బషీరాబాద్ మండలం మైల్వార్ గ్రామం వరకు రూ.55 కోట్లతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామానికి మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, బీ బ్లాక్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశం, బీసీ సెల్ మండల అధ్యక్షుడు అమృతప్ప, ఏఎంసీ డైరెక్టర్లు రాజు, మొగులయ్య, మాజీ సర్పంచులు హన్మంతు, మధుసూదన్‌రెడ్డి, భీమప్ప, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు భీమప్ప, నాయకులు నరేష్, రఘురాంరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, అమర్, బెన్నూరు రఘు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రికెటర్లుగా ఎదగాలి

తాండూరు టౌన్: గ్రామీణ ప్రాంతాల నుంచి అంతర్జాతీయ స్థాయి క్రికెటర్లుగా ఎదగాలని స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి స్థానిక సెయింట్ మార్క్స్ పాఠశాల గ్రౌండ్‌లో సహారా క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ సమ్మర్ క్యాంప్‌ను పాఠశాల ప్రిన్సిపాల్స్ ఫాదర్ ఆరోగ్య రెడ్డి, ఫాదర్ జోసెఫ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆటవిడుపుగా క్రికెట్ ఆడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో క్రికెట్ క్రీడకు ప్రత్యేక స్థానముందన్నారు. అంతర్జాతీయ స్థాయి క్రికెటర్లుగా ఎదగాలంటే కఠోర దీక్ష, కృషి, పట్టుదల అవసరమన్నారు. కార్యక్రమంలో అకాడమీ కోచ్ జగన్నాథ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు పట్లోళ్ల నర్సింలు, ప్రభాకర్ గౌడ్, సాహు శ్రీలత, కాంగ్రెస్ నాయకులు సురేందర్ రెడ్డి, బంటు వేణు తదితరులు పాల్గొన్నారు.



దిర్సంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

- ధాన్యం సేకరణ సజావుగా సాగాలి
- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని దిర్సంపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. కనీస మద్దతు ధర చెల్లించి ధాన్యం సేకరిస్తుందని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోరాదని సూచించారు. ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని అన్నారు. ఆయా గ్రామాలకు చెందిన 122 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గ్యామా, ఏపీఎం సురేశ్, సీసీ లక్ష్మారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి రమేశ్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ బంగ్ల యాదయ్యగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, బద్రి, సీనియర్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, రాములుగౌడ్, అఖిల్, బందెయ్య, మొగులయ్యగౌడ్, సత్యయ్యగౌడ్, బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘భూ భారతి’తో రైతులకు మేలు

- స్పీకర్ ప్రసాద్ కుమార్
- వికారాబాద్‌లో అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

అనంతగిరి: భూమి అంటే ఆదాయాన్ని ఇచ్చే వనరే కాదు.. అది సమాజంలో ఆత్మగౌరవాన్ని ఇచ్చేదని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం వికారాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల శ్రేయస్సు కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తెచ్చిందన్నారు. ఈ చట్టంతో రైతులతో పాటు భూములు కొనుగోలు చేసే ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుందన్నారు. వారసత్వ, ప్రభుత్వ, అటవీ, సాగునీటి శాఖ, అసైన్డ్ భూమి, దేవాదాయ శాఖ భూముల వివరాలు స్పష్టంగా తెలుస్తాయన్నారు. అలాగే భూములు కొనేవారు మోసపోవడానికి ఆస్కారం ఉండదన్నారు. క్షేత్రస్థాయిలో అందరి అభిప్రాయాలు తీసుకొని భూ భారతి చట్టాన్ని పక్కాగా రూపొందించారని తెలిపారు. గత ప్రభుత్వం వ్యాపారులు, దళారులకు లబ్ధి చేకూరేలా ధరణి భూతాన్ని తెచ్చిందని ఆరోపించారు. ధరణి వల్ల నష్టాలే తప్ప ఏ మాత్రం ప్రయోజనం లేదన్నారు. భూ భారతి చట్టాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. కోర్టులను ఆశ్రయించకుండా భూ సమస్యలు పరిష్కరించే వెసులుబాటును భూభారతి చట్టం తీసుకువచ్చిందన్నారు. భూ సమస్యల సత్వర పరిష్కారానికి ఈ చట్టం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, డీసీఎంఎస్ డైరెక్టర్ కిషన్ నాయక్, ఆర్డీఓ వాసుచంద్ర, తహసిల్దార్ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, మాజీ చైర్మన్ సత్యనారాయణ, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, హఫీజ్ , రత్నారెడ్డి, అనంతరెడ్డి, నర్సింలు, రమేష్ కుమార్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: భూ భారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అంతారం గ్రామ రైతు వేదికలో భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గొల్లచెరువును కాపాడండి



గొల్లచెరువును పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు, మత్స్యకార సంఘం సభ్యులు

- మినీ ట్యాంక్ బండ్‌గా సుందరీకరించాలి
- బీజేపీ నాయకుల డిమాండ్
- మత్స్యకార సంఘం సభ్యులతో కలిసి చెరువు సందర్శన

తాండూరు టౌన్: అన్యాక్రాంతానికి గురైన తాండూరు పట్టణంలోని గొల్లచెరువును కాపాడాలని పలువురు బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మత్స్యకార సంఘం సభ్యులతో కలిసి గొల్లచెరువును సందర్శించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం, యువ నాయకుడు కిరణ్ ముదిరాజ్ మాట్లాడారు. గ్రామ సర్వే నంబర్ 107లో ఉన్న గొల్లచెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతం, బఫర్ జోన్‌ను గుర్తించి ఫెన్సింగ్ వేయాలని అధికారులను కోరారు. కొంతమంది చెరువును ఆక్రమించి రియల్‌ఎస్టేట్ పేరుతో ప్లాట్లు చేసి విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. చెరువు బఫర్ జోన్‌లో నిర్మిస్తున్న కట్టడాలను కూల్చియాలన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు చెరువును పరిరక్షించాలని కోరారు. చెరువంతా గుర్రపు డెక్కతో నిండిపోయిందన్నారు. చేపల వృద్ధికి అనుకూలంగా లేకపోవడంతో మత్స్యకారులకు ఉపాధి లేకుండా పోతోందన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి గొల్లచెరువును సందర్శించి కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవడం తోపాటు, సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ లలిత, మత్స్యకార సంఘ సభ్యులు మంతటి రాజు, నరహరి, రాములు, అంజి, కృష్ణ, నర్సింలు, వెంకటేష్, మల్లికార్జున్, రాజేష్, పకీరప్ప, సాయి, రమేష్, లాలు, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

27న ఎప్‌సెట్ మాక్ టెస్ట్

తాండూరు టౌన్: హిందూ ధార్మిక పరిషత్, సేవా భారతి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27న ఎప్‌సెట్ మాక్ టెస్ట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ.. 27వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్థానిక సింధు డిగ్రీ కళాశాలలో మాక్ టెస్ట్ ఉంటుందన్నారు. పరీక్ష రాయాలనుకునే విద్యార్థులు వారి ఎప్‌సెట్ హాల్‌టికెట్ జిరాక్స్ కాపీతో హాజరుకావాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురాకూడదన్నారు. తెలంగాణ ఎప్‌సెట్ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో హిందూ ధార్మిక పరిషత్, సేవా భారతి ప్రతినిధులు గాజుల బస్వరాజ్, వేణుగోపాల్ రెడ్డి, ఓంప్రకాష్ సోమాని, రమేష్, సింధు డిగ్రీ కళాశాల వ్యవస్థాపకులు రంగారావు, ప్రిన్సిపాల్ విజయాదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హిందూ ధార్మిక పరిషత్, సేవా భారతి ప్రతినిధులు

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

అదనపు కలెక్టర్ సుధీర్

అనంతగిరి: జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ (స్థానిక సంస్థలు) అన్నారు. జిల్లాలో నమోదవుతున్న బాల్యవివాహాలు.. నిర్మూలన అనే అంశంపై ఎన్‌సీపీసీఆర్ ఢిల్లీ కమిషన్ ఆన్‌లైన్ సమావేశానికి హాజరై జిల్లా మాతా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, పోలీసు శాఖ, కార్మిక శాఖ అధికారులతో కలిసి జిల్లాలో జరుగుతున్న బాల్యవివాహాలు నిర్మూలించడానికి చేపడుతున్న కార్యక్రమాల గురించి నివేదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అక్కడక్కడ బాల్య వివాహాలు జరుగుతున్నాయని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి వాటిని అరికట్టాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే బడి మానేసిన పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటేశం, సంక్షేమ శాఖ జిల్లా అధికారి జయసుధ, బి.ఆర్.బి కో ఆర్డినేటర్ కాంతారావు, డి.ఎస్.పి శ్రీనివాసరెడ్డి, డిసిపిఓ (ఇంఛార్జి) శ్రీకాంత్, కార్మిక, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కండి



రాపోల్ గ్రామసభలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి

పరిగి: గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు అన్నారు. గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జీపీల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామాలు అన్నివిధాలా అభివృద్ధి చెందాలంటే అన్ని పార్టీల నాయకులు, ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. ప్రజలు కలసికట్టుగా చర్చించుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతి నెలలో నిర్వహించే గ్రామసభలో ప్రతి ఒక్కరూ పాల్గొలన్నారు. అనంతరం సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే దానిపై కార్యాచరణ రూపొందించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్ల రికవరీ సులభం

ఎస్‌ఐ అన్వేష్ రెడ్డి



గౌరయ్యకు ఫోన్ అప్పగిస్తున్న ఎస్‌ఐ అన్వేష్ రెడ్డి

కుల్కచర్ల: సీఈఐఆర్ టెక్నాలజీతో చోరీ చేసిన, పోగొట్టుకున్న ఫోన్లను రికవరీ చేయవచ్చని స్థానిక ఎస్‌ఐ అన్వేష్ రెడ్డి తెలిపారు. జనవరి 14న గండీడు మండలం చిన్నవార్వాల గ్రామానికి చెందిన పోలెపల్లి గౌరయ్య వ్యక్తిగత పనులమీద కుల్కచర్లకు రాగా గుర్తుతెలియని వ్యక్తులు తన ఫోన్‌ను అపహరించారని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా అట్టి ఫోన్‌ను గుర్తించి గురువారం బాధితుడికి అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ఎవరైనా ఫోన్ పోగుట్టుకున్నట్లయితే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సీఈఐఆర్ టెక్నాలజీని ఉపయోగించి ఫోన్‌ను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ రఘు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తగిన గుణపాఠం చెప్పాలి



హస్నాబాద్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూవాహిని సభ్యులు

దుద్యాల్: కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ మండల పరిధిలోని హస్నాబాద్‌లో గురువారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. హిందువాహిని ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడికి పాల్పడిన వారితో పాటు ఇందుకు ప్రోత్సహించిన, సహకరించిన వారికి తగిన గుణపాఠం చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మహేశ్వరం ఆర్టీసీ డిపోకు 'హై లెవల్' అవార్డు



ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డిపో మేనేజర్ లక్ష్మీసుధ

మహేశ్వరం: ఆర్టీసీ డిపోలో బస్సులకు అత్యధిక కేపీఎల్ వచ్చినందుకు మహేశ్వరం డిపోకు హైలెవల్ మైలేజ్ అవార్డు దక్కింది. హైదరాబాద్‌లోని అశోక్ లేలాండ్ వారు నిర్వహించిన సమావేశంలో హైదరాబాద్ సిటీ విభాగంలో ఆల్ బీఎస్‌-6 బస్సులకు అత్యధికంగా 5.77 కేపీఎల్ వచ్చినందుకు మహేశ్వరం డిపోకు హై మైలేజ్ అవార్డ్‌ను ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా డిపో మేనేజర్ లక్ష్మీసుధ అందుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీసుధ మాట్లాడుతూ.. మహేశ్వరం డిపోలో డ్రైవర్లు, మెకానిక్‌లు, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బంది క్రమశిక్షణతో పని చేయడంతో ఈ అవార్డు దక్కిందన్నారు. అందరి కృషితో అవార్డు వచ్చిందని, ఈ అవార్డు మరింత బాధ్యత పెంచిందన్నారు.

బాలికపై కుక్కల దాడి

షాద్‌నగర్: ఇంటి ముందు ఆడుకుంటున్న బాలికపై గ్రామ సింహాలు దాడి చేశాయి. ఈ ఘటన పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో గురువారం చోటు చేసుకుంది. స్థానికంగా నివాసం ఉంటున్న నాగరాజు కూతురు అవని(8), ఇంటి ముందు ఆడుకుంటుండగా.. బాలికపై వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో చిన్నారికి గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. పట్టణంలో కుక్కల బెడద ఎక్కువ అయిందని, మున్సిపల్ అధికారులు స్పందించి శునకాలను తరలించాలని కోరుతున్నారు.

భూ భారతితోనైనా.. సమస్య తీరేనా!

- ధరణి వెబ్‌సైట్‌లో భూముల వివరాలు మాయం
- ఏడేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులు
- ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలకు దూరం
- కొత్త చట్టం కోసం ఆశగా ఎదురుచూపు



పూడూరులో భూ భారతి చట్టంపై అవగాహన కల్పిస్తున్న అడిషనల్ కలెక్టర్ (ఫైల్)

పూడూరు: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం మూలంగా ప్రభుత్వం అందించే రైతుబంధు, రైతు భరోసాకు దూరమైన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు చేసిన చిన్నతప్పిదం వల్ల ఆన్‌లైన్‌లో వీరి పేర్లు గల్లంతయ్యాయి. వివరాల్లోకి వెళితే.. పూడూరు మండలం సోమన్‌గుర్తి, రాకంచర్ల, గ్రామాలకు చెందిన రైతుల పొలాలు బీజాపూర్ జాతీయ రహదానికి ఇరువైపులా ఉన్నాయి. 25 మందికి సంబంధించి వంద ఎకరాల భూమి గల్లంతైంది. రోడ్డులో పోయిన భూమిని సర్వే చేసి, ఆ విస్తీర్ణాన్ని మాత్రమే రికార్డుల నుంచి తొలగించాలి. కానీ మొత్తం భూమి ఆన్‌లైన్‌లో నుంచి వెళ్లిపోయింది. రోడ్డులో భాగంగా పోయిన భూమిని లెక్కగట్టి పరిహారం అందించిన అధికారులు, మిగిలిన భూమికి డిజిటల్ సైన్ చేయలేదు. దీంతో ఈ వివరాలన్నీ మాయమయ్యాయి. సమస్యను పరిష్కరించాలని కోరుతూ నాలుగేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగున్నా పట్టించుకునే వారే లేకుండా పోయారని బాధితులు పేర్కొంటున్నారు. ధరణిలో దరఖాస్తు చేసుకోగా కలెక్టర్ లాగిన్‌లోకి వెళ్లిందని తెలిపారు. అక్కడికి వెళ్లినా సమస్య మాత్రం పరిష్కారం కాలేదని వాపోతున్నారు. కనీసం భూభారతి ద్వారా అయినా తమకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నారు.

ఏడేళ్లుగా నష్టపోతున్నాం



మా పొలం ఆన్‌లైన్‌లో లేకపోవడంతో ఏడేళ్లుగా నష్టపోతున్నాం. బ్యాంకు రుణాలు అందలేదు. రైతు భరోసా సైతం రాకపోవడంతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలకు దూరమయ్యాం. మా సొంత భూమిలో నుంచి రోడ్డు వెళ్లింది. అందులో ఆరు గుంటలు పోయింది. కానీ మా పేరున ఉన్న మొత్తం భూమి ఆన్‌లైన్‌లో కట్ అయింది.

– రఘురాంరెడ్డి , రైతు, సోమన్‌గుర్తి

భూ భారతిలో పరిష్కరిస్తాం

ప్రభుత్వం తెచ్చిన భూభారతి చట్టం ద్వారా బాధిత రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం. రోడ్డు విస్తరణలో రాకంచర్ల, సోమన్‌గుర్తి రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో లేని కారణంగా ప్రభుత్వ పథకాలు అందలేదు. వచ్చే నెల నుంచి గ్రామ సభలు నిర్వహించేలా కలెక్టర్ ఆదేశించారు. వివరాలు సేకరించి త్వరలోనే రైతుల సమస్యను పరిష్కరిస్తాం.

– భరత్‌గౌడ్, తహసీల్దార్, పూడూరు

అవమాన భారం.. ఆత్మహత్యా యత్నం



చికిత్స పొందుతున్న బిచ్చిరెడ్డి



ఆస్పత్రిలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- పురుగు మందు తాగిన అధికార పార్టీ నాయకుడు
- వికారాబాద్ ఆస్పత్రిలో పరామర్శించిన ఎమ్మెల్యే జీఎమ్మార్

బషీరాబాద్: సొంత పార్టీ నేతలు అవమానించడం, ఎమ్మెల్యే ఫోన్ చేసి పార్టీ నుంచి సస్పెండ్ చేస్తానని హెచ్చరించడంతో మనస్తాపానికి గురైన ఓ సీనియర్ నాయకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటన గురువారం మైల్వార్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ క్రమంలో జోగికాలనీకి చెందిన పలువురు మహిళలు తమకాలనీలో సీసీ రోడ్డు ఎందుకు వేయడంలేదని ఎమ్మెల్యేను ప్రశ్నించారు. ఇదే సమయంలో సీనియర్ నాయకుడు సొంపల్లి బిచ్చిరెడ్డి మైక్ తీసుకొని మాట్లాడుతుండగా.. పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ మైకు లాక్కున్నారు. మహిళలతో ఎందుకు గొడవ పెడుతున్నావని గద్దించారు. సమావేశం ముగిసిన తర్వాత ఎమ్మెల్యే తనకు ఫోన్ చేసి పార్టీ నుంచి సస్పెండ్ చేస్తానని హెచ్చరించాడని బిచ్చిరెడ్డి ఆరోపించారు. తాను పదేళ్లుగా పార్టీ కోసం పనిచేస్తుంటే కొత్తగా వచ్చిన వారిని ప్రోత్సహిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామ ప్రజల ఎదుట అవమానించారని తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఇంటికి వెళ్లి సూసైడ్ నోట్ రాశాడు. నావంద్గీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, కాంగ్రెస్ నాయకుడు సంగిశెట్టి సతీష్, బుగ్గప్ప, రాజు తన చావుకు కారణమని పేర్కొన్నారు. అనంతరం ఇంట్లో ఉన్న పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే తాండూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించగా ఉండడంతో వికారాబాద్‌లోని మిషన్ ఆస్పత్రికి తరలించారు.

తన భర్తను రాజకీయంగా అణగదొక్కేందుకు సతీష్, అజయ్‌ప్రసాద్ కుట్ర చేశారని బిచ్చిరెడ్డి సతీమణి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వనలమాల ఆరోపించారు. ఇదిలా ఉండగా బిచ్చిరెడ్డితో తమకు ఎలాంటి విభేదాలు లేవని అజయ్‌ప్రసాద్, సతీష్ తెలిపారు. వికారాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బిచ్చిరెడ్డిని గురువారం రాత్రి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పరామర్శించారు. పార్టీలో బిచ్చిరెడ్డికి అన్యాయం జరుగకుండా చూస్తానని హామీ ఇచ్చారు. మెరుగైన వైద్యం అందించాలని అక్కడి వైద్యులకు సూచించారు.

పార్కుల్లో పచ్చదనం పెంచాలి



పార్కును పరిశీలిస్తున్న తిరుపతిరెడ్డి

- ఆహ్లాదకరంగా మార్చాలి
- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి

కొడంగల్: పార్కుల్లో పచ్చదనాన్ని పెంచి, ఆహ్లాదకరంగా మార్చాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి అన్నారు. పట్టణంలోని లాహోటీ కాలనీ పార్కును గురువారం ఆయన సందర్శించారు. పార్కుల్లో చేపడుతున్న పనులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు పట్టణాలకు మాత్రమే పరిమితమైన పార్కులు ఇప్పుడు పల్లెల్లో కూడా కనువిందు చేస్తున్నాయని తెలిపారు. పట్టణ ప్రకృతి వనాలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయని స్పష్టంచేశారు. లాహోటీ కాలనీ, వర్ష కాలనీల్లో ఏర్పాటు చేసిన పార్కులపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని అందంగా తీర్చిదిద్దాలని సూచించారు. కుర్చీలు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్త, ఏఎంసీ చైర్మన్ అంబయ్యగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, యువజన కాంగ్రెస్ జాతీయ సమన్వయకర్త కృష్ణంరాజు, మైనార్టీ నాయకుడు నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

మే నెల సెలవులు ఇవ్వాలి

- అంగన్‌వాడీ హెల్పర్స్ యూనియన్ డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

అనంతగిరి: అంగన్‌వాడీ సెంటర్లకు మే నెల మొత్తం సెలవులు ఇవ్వాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భారతి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ సుధీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేణుక, శారద, లక్ష్మి, సునీత, భారతి, సుజాత, అండాలు, ప్రమీల, బాలమణి, పెంటమ్మ, వెంకటమ్మ, నిర్మల, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రమూకలకు ఉరిశిక్ష వేయాలి

బార్ అసోసియేషన్ సభ్యుల డిమాండ్



కొడంగల్ రూరల్: మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు

కొడంగల్ రూరల్: జమ్ముకశ్మీర్‌లో అమాయక పర్యాటకులపై కాల్పులు జరిపి అత్యంత దారుణంగా హతమార్చిన ఉగ్రమూకలకు ఉరిశిక్ష వేయాలని బార్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ భవనంలో విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఉగ్రదాడిలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతలను పెంచాలని, ఉగ్ర చర్యలపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో కొడంగల్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బస్వరాజు, ప్రధాన కార్యదర్శి బి.వెంకటయ్య, సీనియర్ న్యాయవాదులు టి.కరుణాకర్‌రెడ్డి, టి.రాములు, మురళీమోహన్ నామాజీ, భాగ్యలత, జూనియర్ న్యాయవాదులు బి.కృష్ణయ్య, కె.రమేష్, భానుప్రసాద్, మొహీద్, భీమయ్య పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

అనంతగిరి: కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడిని నిరసిస్తూ వికారాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. నల్లబ్యాడ్జీలు ధరించి ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజ్ మాట్లాడుతూ.. పహల్గాం ఘటన తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. ఉగ్రమూకల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడిలో గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ఘటనకు కారకులైన వారిని వదిలిపెట్టొద్దని కేంద్రానికి లేఖ రాశారు. ఈ లేఖను వికారాబాద్ ఆర్డీఓ వాసుచంద్రకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శంకరయ్య, కోశాధికారి మోహన్ రాథోడ్, లైబ్రేరీ ఇంచార్జి సాయి, సీనియర్ నాయకులు కమాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మాధవరెడ్డి, నాగరాజు, రాంచంద్రయ్య, శుభప్రద్‌పటేల్, జగన్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి అమానుషం

కొడంగల్ రూరల్: ఉగ్రవాదులు అమాయకులను పొట్టన పెట్టుకోవడం అత్యంత బాధాకరమని మైనార్టీ నాయకులు ఎస్‌ఎం.గౌస్ అన్నారు. గురువారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనలో సయ్యద్ ఆదిల్ హుస్సేన్ ఉగ్రవాదులతో పోరాడి పర్యాటకులను రక్షించే ప్రయత్నంలో బలైపోయాడని పేర్కొన్నారు. ఘటనకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఉగ్రదాడిలో గాయపడిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘనటలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



అనంతగిరి: విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

అదృశ్యమై.. చెరువులో శవమై..



రాజు(ఫైల్)

మొయినాబాద్: భార్యతో గొడవ పడి అదృశ్యమైన వ్యక్తి చెరువులో శవమై తేలాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధి ఎనికేపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎనికేపల్లికి చెందిన మల్కపురం రాజ(37) పెయింటర్‌గా పనిచేసేవాడు. ఈ నెల 21న రాత్రి మద్యం మత్తులో భార్య స్వప్నతో గొడవ పడ్డాడు. 22న తెల్లవారుజాము 4 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో తెలిసిన చోట్ల ఆరా తీశారు. అయినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో అతడి భార్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా.. గురువారం సాయంత్రం గ్రామ సమీపంలోని చెరువులో రాజు మృతదేహం తేలింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటకు తీశారు. వివరాలు సేకరించి పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భవిష్యత్తుకు టెక్నాలజీ కీలకం



సదస్సుల్లో మాట్లాడుతున్న ఈసీఐఎల్ టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ అనిష్‌కుమార్ శర్మ

ఇబ్రహీంపట్నం రూరల్: భవిష్యత్తును రూపొందించడానికి టెక్నాలజీ ఎంతో కీలకమని ఈసీఐఎల్ టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ అనిష్‌కుమార్ శర్మ పేర్కొన్నారు. మంగళ్‌పల్లి సమీపంలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఎలక్ట్రానిక్స్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ‘రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఎంబెడెడ్ కంప్యూటింగ్, కంట్రోల్ ఆటోమేషన్’ అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అనిష్‌కుమార్ శర్మ మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక అంశాల్లో అధిక నాణ్యత గల పరిశోధన.. ఎంబెడెడ్ సిస్టం, డిజైన్, రోబోటిక్స్, ఆటోమేషన్, సెన్సార్ నెట్వర్క్, రియల్ టైం సిస్టమ్ అవసరమన్నారు. కార్యక్రమంలో గౌరవ అతిథి డాక్టర్ భోజన్న పాసిక్, కీనోట్ స్పీకర్ సుమన్ సనం, కళాశాల చైర్మన్ డాక్టర్ రాఘవ, డైరెక్టర్ రామశాస్త్రి, ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, డీన్ లాల్‌కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఘరానా దొంగ అరెస్టు

జీడిమెట్ల: ఇంట్లో ఎవరూలేని సమయంలో కిటికీ గ్రిల్స్ తొలగించి ఇంట్లో ఉన్న బంగారు, వెండి నగలు దోచుకెళ్లే గజదొంగను జీడిమెట్ల పోలీసులు అరెస్టు చేసి రూ.11.5లక్షల సొత్తు రికవరీ చేశారు. గురువారం జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్, డీఐ కనకయ్య వివరాలను వెల్లడించారు. అపురూప కాలనీకి చెందిన పింటూ మార్చి 5న కుటుంబ సభ్యులతో కలిసి కలకత్తా వెళ్లాడు. మరుసటి రోజు వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించాడు. ఇది సీసీ కెమెరాలో రికార్డ్ అయి ఉంది. ఉదయం సీసీ కెమరాలను పరిశీలించిన పింటూ ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితుడు వేణుగోపాల్(26), సంపత్‌సాయి(20)గా గుర్తించారు. బుధవారం సాయంత్రం వేణుగోపాల్‌ను జీడిమెట్ల పోలీసులు అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి రూ.11.5లక్షలు విలువచేసే బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. కాగా మరో నిందితుడు సంపత్ సాయి పరారీలో ఉన్నాడు. ఈమేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి వేణుగోపాల్‌ను రిమాండుకు తరలించారు. వేణుగోపాల్ సైబరాబాద్ పోలీస్టేషన్ పరిధిలో ఇప్పటికే 44కేసుల్లో నిందితుడుగా ఉండగా గతంలో దుండిగల్ పీఎస్ నుండి పీడీయాక్టు ద్వారా సంవత్సరం జైలుశిక్ష అనుభవించాడు.

ఉపాధి కూలి రూ.600 చేయాలి



ఉపాధి హామీ పథకం కూలీలతో సీపీఎం నేతలు

- పని ప్రదేశంలో వసతులు కల్పించాలి
- వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సత్తయ్య డిమాండ్

దోమ: ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు వేతనం పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సత్తయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని తిమ్మాయిపల్లిలో ఉపాధి హామీ పనులను సీపీఎం నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారి కూలి రూ.600లకు పెంచాలని కోరారు. గ్రామంలో ఉపాధి పనులు చేసిన కూలీలకు ఆరు వారాలుగా డబ్బు ఇవ్వలేదని తెలిపారు. వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే పని ప్రదేశంలో నీడ, తాగునీటి సౌకర్యం, మెడికల్ కిట్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొలతల పేరుతో కూలీల వేతనంలో కోతలు విధించడం సరికాదన్నారు. రోజువారి కూలి రూ.307 ఉంటే రూ.100 నుంచి రూ.150 చెల్లించడం దుర్మార్గమన్నారు. ఈ డబ్బు కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోవని మండిపడ్డారు. రోజువారి కూలి రూ.600, పని దినాలు 200లకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూలీలకు గడ్డపారలు, గంపలు ఇవ్వాలన్నారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి పి.రఘురాం, నాయకులు సత్యయ్య, శ్రీనివాస్, శేఖర్ పాల్గొన్నారు.

సర్కారు బడిలో సమ్మర్ క్యాంప్



మిట్టకోడూర్‌లో సమ్మర్ క్యాంపును ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

- ప్రారంభించిన ప్రధానోపాధ్యాయుడు ఉస్మాన్‌అలీ
- సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచన

పరిగి: పాఠశాలల్లో నిర్వహించే సమ్మర్ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు ఉస్మాన్‌అలీ అన్నారు. మిట్టకోడూర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు స్వచ్ఛందంగా శిబిరానికి రావాలని సూచించారు. ఇందులో తెలుగు, ఇంగ్లిష్, గణితంతో పాటు చిత్రలేఖనం, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు నేర్పిస్తారని తెలిపారు. ప్రతిభను మెరుగుపర్చేందుకు ఇలాంటి శిబిరాలు ఎంతగానో దోహదం చేస్తాయని స్పష్టంచేశారు. తల్లిదండ్రులు చొరవ తీసుకుని పిల్లలను క్యాంపునకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ మెంటర్ హన్మంతు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసమే పథకాలు

- సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మకం
- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



సీసీ రోడ్డు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు

పరిగి: ప్రతీ పేద కుటుంబం సగర్వంగా బతికేలా కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిగురాల్‌పల్లి, గోవిందాపూర్, మిట్టకోడూర్, లక్నాపూర్‌లో గురువారం జైబాపు జైభీమ్ జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం చిగురాల్‌పల్లి దళితవాడాలో సన్నబియ్యంతో సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ పేద కుటుంబం నిత్యం ఇంట్లో సన్నబియ్యంతో భోజనం చేసే గొప్ప పథకాన్ని చరిత్రాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి పేద ప్రజల కోసం సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రతిఒక్కరికీ అందజేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాజ్యాంగాన్ని కూనీ చేసే కుట్ర పన్నుతోందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం ఎలా మోసం చేస్తుందో ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంతి అమిత్‌షా అంబేడ్కర్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు తౌర్యానాయక్, పార్టీ నాయకులు చిన్న నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.